రాను రాను

# ప్రజాపతులెవరు?

టి. వి. శంకరం

"ఈ ఎన్నికలలో కాంగ్రెసు దేశాన్ని ఊడ్చేస్తుందని ముందుగానే జోస్యం చెప్పవచ్చు. అట్లా ఫలితాలు ముందుగానే తెలిసిపోయినప్పుడు ఎన్నికలు ప్రజాస్వామికంగా జరిగా యనవచ్చునా?... అనవచ్చు!"

ప్రస్తుతం మన దేశంలో జరిగే ఎన్నికలను గురించి ఒక అమెరికన్ పత్రిక వ్యాఖ్యానానికి పై మాటలు జ్ఞాపకానువాదం

ప్రజాస్వామ్యం, ప్రజాతంత్రం, వోటింగు హక్కు, ప్రజాప్రభుత్వం—ఇటువంటి మాటలన్నీ వొట్టి హంబగ్ అని ఎవరైనా ఎలుగెత్తి అరిస్తే బాగుణ్ణు!

దీని శ్రాద్ధం బెట్ట! ఈ ప్రజా వంచనకు కొన్ని ఊత పదాలు ఉండితీరాలి రాగి డబ్బులాటిది ప్రభుత్వ మింటులోంచి రాలేదని తోస్తే బిచ్చగాడు కూడా తిరగొట్టేస్తాడు కాని ఈ కౌంటర్‌ఫీట్ మాటలు చలామణీ కాకుండా ఆపగలవాడు కనబడడు.

ప్రజలు తమను తాము పరిపాలించుకోగలరా? చచ్చినా పరిపాలించుకోలేరు! కనీసం తమను ఎవరు పరిపాలిస్తే తమ జీవితం సాధ్యమైనంత సుఖంగా వెళ్ళిపోతుందో వాళ్లకి తెలుసా? చచ్చినా తెలీదు! అథవా తెలిసినా అటువంటి వాళ్లను వాళ్లు ఎన్నికలకు నిలబెట్టలేరు. అథవా ఒకరో ఇద్దరో నిలబడినా వాళ్ళు శాసన సభలకు పోయి ఏమీ చెయ్యలేరు.

ఈ దేశంలో గర్భదరిద్రులు నూటికి అథమం తొంభైయిమంది అయినా ఉంటారు. దేశమంతటా ఎన్నికలకు నిలబడేవారిలో ఒక్కడైనా గర్భదరిద్రుడుంటాడా? ఉండడు.

ఈ ఎన్నికలు పార్టీ నియంతృత్వం అమలు జరగటానికి ఏర్పాటైనవి ఏ ప్రత్యేక ప్రదేశంలోనైనా ఒక పార్టీ నియంతృత్వం సాధ్యం కాకపోతే, తెరవెనక భాగోతం జరిగి ఊళ్ళు పంచుకునే దొంగలు పదవులలోకి వస్తారు.

ప్రతి పార్టీ లోపలా మళ్ళీ నియంతలుంటారు; వాళ్లు తాళ్ళు లాగినప్పుడల్లా చేతులెత్తే కళ్ళునగాళ్ళూ ఉంటారు. కొన్ని పార్టీల వెనక లంకెబిందెలవాళ్లుంటారు

"ప్రజాస్వామికానికి" పట్టుగొమ్మలనదగిన పత్రికలలోనూ, ప్రజానాయకులమని చెప్పుకునే వాళ్ళ నోటా వెలువడే కొన్ని ప్రవచనాలు చూస్తే వాంతి వస్తుంది

"కాంగ్రెసును ఎన్నికలలో ఎదిరించేవాళ్ళు దేశ ద్రోహులు!"

"స్వతంత్రంగా నిలబడేవాళ్ళు దుష్టులు!"

ఇక దేశభక్తులెవరు?

ఎన్నికలకు అభ్యర్థులను నిలబెట్టే అర్హత లేని కమ్యూనిలిస్టులు బహిరంగంగా బలపరిచే వాళ్లు!

"మా పార్టీ తరఫున నిన్నటిదాకా దేశద్రోహుల పాత్ర నిర్వహించినవాళ్ళనూ, ప్రజాద్రోహులనూ, దోపిడీ మురాలవాళ్ళనూ నిలబెడుతున్నాం మీరు వాళ్ళను చూసి వోటివ్వకండి పార్టీని చూసి వోటివ్వండి! మీ ప్రతినిధి మీ భాషవాడు కాకపోవచ్చు, మీ దేశంవాడు కాకపోవచ్చు. అయినా పార్టీని చూసి వోటివ్వండి."

మాటలివికావు గాని, వైఖరి ఇదే!

మధ్య ప్రదేశ్‌లో ఒక ముసలిది తన వోటును "నెహ్రూ కుమార్తెకు" వెయ్యటానికి నాలుగుమైళ్ళ దూరానఉన్న పోలింగ్ బూత్‌కు బయలుదేరిందిట. "నెహ్రూ కూతురు" అభ్యర్థిగా నిలబడటంలేదని చెప్పారు; ముసలిది వోటు వెయ్యకుండా ఇంటికి తిరిగిపోయింది.

ఈ ముసలిదానికి తెలిసిన ప్రజాస్వామ్యం మీద నాకు చాలా గౌరవం ఉంది. తమకు కావలిసిన అభ్యర్థులు లేని కారణంచేత ఉదయం ఎనిమిదిన్నరదాకా పోలింగ్ స్టేష నుకు పోని వోటర్లమీద నాకు గౌరవం ఉంది; అదే కారణంచేత అసలు వోటే వెయ్యని అసంఖ్యాకులకు ప్రజాస్వామ్యం తెలీదనటానికి ఎవరికీ అధికారం లేదు

ఈ దేశంలో ప్రజాస్వామ్యం తలకిందికి పెట్టి కాళ్ళు పైకెత్తిన కారణంచేత అనేక విడ్డూరాలు జరుగుతున్నాయి.

జమీందార్లూ, రాజాలూ, ధనిక ఖామందులూ, లంకెబిందెలవాళ్ళూ దేశంలో సోషలిస్టు వ్యవస్థ తెచ్చిపెట్టటానికి వీర కంకణం కట్టుకున్నారు; సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ సోషలిస్టు వ్యవస్థ స్థాపించటానికి బొత్తిగా పనికిరానివాళ్ళయిపోయారు!

ఒక్కొక్క పంచవర్ష ప్రణాళికే విజయం పొందుతున్న కొద్దీ విదేశీయుల లాభాలు పెరుగుతున్నాయి, విదేశీ పెట్టుబడి అంతకంతకూ హెచ్చుగా కావలిసి వస్తున్నది ఒక వంక ధరలూ, ఇంకో వంక నిరుద్యోగమూ పెరుగుతున్నట్టు కనిపిస్తున్నది

నామినేషన్లు ప్రజలనుంచే వచ్చి, ఎన్నికలలో ఓడిపోయినవాడికి ధరావతులు పోవటం, చేతిచమురు దండుగ కావటం మొదలైన అవమానాలు అవసరం లేకుండా పోయి, ఎన్నికైన అన్ని పార్టీల వాళ్లనూ పాలకవర్గంలో ఉండనిచ్చిన రోజున ఈ దేశంలో కొంత ప్రజాతంత్రం అమలు జరుగుతుంది.

(ఇంచుమించు ఇదే పద్ధతిలో ఆలోచన చేసిన ఇండొనీషియా అధ్యక్షుడి సూచనను తోసి అవతల పారేశారు!)

ఏ కారణాలవల్లనైనా మన దేశంలో పార్టీ నియంతృత్వమేతప్ప ప్రజాతంత్రం అమలు జరగటానికి వీలులేని పక్షాన ఆ మాట స్పష్టంగా గుర్తించటం మంచిది.

"గులాబీకి ఇంకే పేరన్నాపెట్టు, దాని వాసన కమ్మగానే ఉంటుంది," అన్నాడు షేక్స్పియరు ఇంకేదో పువ్వును గులాబీ అన్నంత మాత్రాన అది గులాబీవాసనమటుకు కొట్టదు.

ఇప్పుడు అమలులో ఉన్నదాన్ని ప్రజాతంత్రం అనవద్దు

పార్టీ ప్రతినిధులను ప్రజాప్రతినిధులనవద్దు. నూటికి యాభైమంది వోటుచేస్తే అందులో ముప్ఫైమంది వోట్లు తెచ్చుకుని అఖండ విజయంతో నెగ్గినవాడు ఏ లెక్కన ప్రజాప్రతినిధి అవుతాడు?

భవిష్యత్తులో ప్రజలకు ఏమి చెయ్యబోయేదీ చెప్పకుండా జరిగిన చరిత్ర ఆధారం మీద వోట్లు అర్థించేవాళ్లు వాగ్దానాలు చేసేదీ లేదు, వాటిని నిలబెట్టుకునేదీ లేదు.

ఒక పార్టీ టిక్కెట్టుమీద ఎన్నికైనవాడు మళ్ళీ ఎన్నికలు జరిగేలోపల మూడు పార్టీలు మారడనిలేదు!

పదవికోసర చెయ్యరానిది లేదు అన్నవైఖరి అమలులో ఉండగా ప్రజాతంత్రం అమలులోకి రావటం సాధ్యంకాదు.

కాంగ్రెసు పార్టీ నియంతృత్వంకూడా అవసరంలేదు, నెహ్రూ నియంతృత్వానికి అనుకూలంగానూ, ప్రతికూలంగానూ దేశమంతటా ప్రజలను వోట్లు వెయ్యమంటే అధిక సంఖ్యలో ప్రజలు నెహ్రూకు అనుకూలంగా వోటు చెయ్యవచ్చు! అటువంటి పరిస్థితి దేశంలో లేదనటానికిలేదు

ఈ సంగతి గుర్తించేకాబోలు మద్రాసులో ఒక కాంగ్రెసు ఎన్నికల పోస్టరుమీద స్థానిక కాంగ్రెసు అభ్యర్థుల బొమ్మలకు బదులు నెహ్రూ బొమ్మను వేశారు!

చాలామందికి బలమైన ప్రతిపక్షంలో విశ్వాసము ఉన్నట్లు కనబడుతుంది. సిద్ధాంతం ప్రకారం పార్టీ నియంతృత్వం అదుపులో ఉంచటానికి బలమైన ప్రతిపక్షం ఉపకరిస్తుంది.

అయితే ఈ పుణ్యభూమిలో అటువంటి శషభిషలు పనికిరావు. కాంగ్రెసుప్రభుత్వాలు తెచ్చిపెట్టిన బిల్లులు తీవ్రమైన విమర్శలకు గురి అయికూడా, ఆ విమర్శలలో కాంగ్రెసు సభ్యులే

(తరువాయి 12-వ పేజీలో)